నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
3 | మహబూబ్‌నగర్, శనివారం 1 జూన్ 2024 | NAGARKURNOOL

మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె

ఆవిర్భావ దినోత్సవం అదరాలె

- పదేండ్లలో తెలంగాణను దేశం గుర్తించేలా అభివృద్ధి చేశాం
- మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె

మహబూబ్‌నగర్ అర్బన్, మే 31: జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అదిరేలా నిర్వహించాలని మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. కేసీఆర్ సారథ్యంలో మలిదశ ఉద్యమ పోరాటంతో దేశంలో 33 పార్టీలను ఒప్పించి తెలంగాణను సాధించుకున్నామన్నారు. ఆనాడు కేసీఆర్ 14ఏండ్లు ప్రాణాలకు తెగించి పోరాటం చేశారని, వారి నాయకత్వంలో మేము భాగస్వాములమై తెలంగాణ సాధిస్తే.. ఇప్పుడు ఆ ఉద్యమకారుడు కేసీఆర్‌ను విమర్శించడం సరైనది కాదన్నారు. తెచ్చుకున్న తెలంగాణను పదేండ్లు పూర్తి స్థాయి లో అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ కృషి చేశారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అణుగుణంగా కేసీఆర్ పాలన సాగిందని, ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి తాగునీరు అందించామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం, నాణ్యమైన కరెంట్ చివరకు పండించిన పంటను కూడా కొనుగోలు చేశామన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విత్తనాల కోసం రైతులు ఎప్పుడూ చెప్పులు క్యూలైన్‌లో పెట్టలేదన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజక్టును 80 శాతం పనులు పూర్తి చేశామని మిగిలిన పనులు పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పేరును అడ్డుకునేందుకు మహబూబ్‌నగర్ నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో అన్ని అభివృద్ధి పనులను నిలిపివేయడం వారి చేతగాని తనానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చిహ్నాలు మార్పు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సూచించారు. అనంతరం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ నుంచి ర్యాలీగా బయలుదేరి అమరవీరుల స్తూపం వద్ద ఉద్యమ రథసారథి కేసీఆర్ నాయకత్వంలో ఘనంగా నివాళులర్పిస్తామన్నారు. 2న తెలంగాణ భవనంలో ఉదయం 9గంటలకు కేసీఆర్ ఆధ్వర్యంలో జెండా విష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 3వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ ఆఫీసులో జిల్లా అధ్యక్షులతో కలిసి జెండా ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు వివరించారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పదేండ్లలో తెలంగాణను అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పరుగులు పెట్టించారన్నారు. 2014కు ముందు తెలంగాణ ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉందనే విషయాలను ప్రజలు గమనించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ఆరునెలల్లోనే ప్రజలను అరిగోస పెడుతున్నదని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, నాయకులు వెంకన్న, గణేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, తదితరులున్నారు.

నకిలీ క్లినిక్‌లపై వేటు..

నమస్తే ఎఫెక్ట్

- ధరూర్‌లో తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో శశికళ
- నిబంధనలకు విరుద్ధంగా సెలైన్ ఎక్కించడంపై ఆగ్రహం
- అనుమతులు లేని క్లినిక్‌లు తాత్కాలికంగా బంద్

క్లినిక్‌ను మూయిస్తున్న డీఎంహెచ్‌వో శశికళ, చిత్రంలో సిబ్బంది, క్లినిక్ నిర్వాహకుడు

ధరూరు, మే 31 : 'చదివింది చారెడు.. చికిత్సలు బారెడు' అనే శీర్షికన ఈనెల 19న నమస్తే తెలంగాణ దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈమేరకు జిల్లా వైద్య యంత్రాంగం ఎట్టకేలకు స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా, మెడికల్ రూల్స్, శుభ్రత పాటించకుండా క్లినిక్‌లు నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారిణి శశికళ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని క్లినిక్‌లను ఆమె సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. వైఎస్సార్ చౌరస్తాలోని కంసలి శ్రీనివాస్, చాకలి శ్రీను క్లినిక్‌లను పరిశీలించారు. కాగా కంసలి శ్రీనివాస్ క్లినిక్‌లో చిన్నారులకు సెలైన్ ఎక్కించడం, హైడోస్ యాంటిబయాటిక్ మందులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లినిక్‌లో బయో మెడికల్ వేస్టేజీ లేకపోవడం, వాడిన సిరంజీలను సరైన పద్ధతిలో డంప్ చేయకపోవడంపై ఆమె సీరియస్ అయ్యారు. ప్రథమ చికిత్సకు బదులు కనీస శుభ్రత పాటించకుండా వైద్యం చేస్తారా? ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పర్యావరణం కలుషితమై ఎయిడ్స్, హైపటైటిస్ వ్యాధులు ప్రబలుతాయని తెలియదా అని మందలించారు. క్వాలిఫైడ్ డాక్టర్ లేకుండా ఎలా వైద్యం చేస్తారని నిలదీశారు. నిబంధనలు పాటించకపోవడమే కాకుండా మహిళా వైద్యాధికారిణులతో దురుసుగా ప్రవర్తించినందుకు క్లినిక్‌ను తాత్కాలికంగా బంద్ చేయించారు. అలాగే చాకలి శ్రీను క్లినిక్‌ను పరిశీలించి ఇవి ప్రథమ చికిత్స కేంద్రాలా? లేక ఎంబీబీఎస్ దవాఖానలా? అని అడిగారు. అవగాహన లేని వైద్యంతో ఎన్ని ఇబ్బందులొస్తాయో ఒక్కసారైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. ఈక్రమంలో రెండు క్లినిక్‌లను బంద్ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్ధప్ప, ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవంతి పాల్గొన్నారు.

చెంచులక్ష్మి మ్యూజియాన్ని పునరుద్ధరిస్తాం

- వ్యాపార సముదాయ భవనాన్ని ఏర్పాటు చేస్తాం..
- చెంచుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం
- గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ శరత్

చెంచులక్ష్మి మ్యూజియం పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

అమ్రాబాద్, మే 31 : చెంచుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ శరత్ తెలిపారు. శుక్రవారం అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ ఐటీడీఏ కార్యాలయాన్ని కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చెంచులక్ష్మి హోటల్, మ్యూజియాన్ని పరిశీలించి వాటిని త్వరలోనే పునరుద్ధరించి సందర్శకులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అదేవిధంగా 100 మంది చెంచులకు ఉపాధి అందించడమే లక్ష్యంగా ప్రత్యేక వ్యాపార సముదాయాన్ని నిర్మిస్తామని చెప్పారు. చెంచుల సమస్యలను శాశ్వతంగా దూరం చేసేందుకు పూర్తిస్థాయి ఐటీడీఏ కార్యాలయాన్ని మన్ననూర్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం శానిటరీ నాప్కిన్ కేంద్రాన్ని పరిశీలించగా.. యంత్రాలు పనిచేయడం లేదని చెంచు మహిళలు తెలిపారు. దీంతో భద్రాచలంలో నడిచే నాప్కిన్ కేంద్రం మాదిరిగా ఈ యంత్రాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో ఉన్న పీటీజీ గురుకుల ఆర్‌సీవో కార్యాలయాన్ని మన్ననూర్‌కు తీసుకొస్తామన్నారు. తాగునీరు, విద్యుత్, వ్యవసాయ, వ్యవసాయేతర తదితర సమస్యలపై కలెక్టర్ ఇచ్చిన నివేదికను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్‌గోపిడి, డీటీడీవో కమలాకర్‌రెడ్డి, జీసీసీ మేనేజర్ సంతోష్, ఇంజినీరింగ్‌శాఖ డీఈ వెంకటేశ్వరసింగ్, తాసీల్దార్ సరిత, అధికారులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ బాలుర కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

- రేపే ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం
- 1,439 ఓట్లకుగానూ 1,437 పోల్
- ఐదు టేబుళ్లు.. రెండు గంటల్లో ఫలితం
- పాలమూరులో భారీ బందోబస్తు
- కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్
- గెలుపుపై గులాబీ ధీమా

మహబూబ్‌నగర్, మే 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): స్థానిక ప్రజాప్రతినిధుల శాసనమండలి ఎన్నికల ఫలితాలు ఉత్కంఠ రేపుతున్నాయి. మరో 24 గంటల్లో ఫలితం వెలువడనుండడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో కౌంటింగ్ కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయగా రిటర్నింగ్ అధికారి రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్ పరిశీలించారు. బ్యాలెట్ పత్రాలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలను తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమవనుండగా.. అంతకుముందు ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూం తెరిచి బ్యాలెట్ బాక్స్‌లను టేబుళ్ల వద్దకు తీసుకొస్తారు. ఐదు టేబుళ్లలో రెండు రౌండ్లలో ఫలితాన్ని లెక్కించేలా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో పాలమూరు జిల్లా కేంద్రంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా ఫలితంపై ఇటు బీఆర్ఎస్ అటు కాంగ్రెస్ ధీమాతో ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 1,439 ఓట్లకు గానూ 1,437 పోలయ్యాయి. మార్చి 28న పోలింగ్ జరుగగా ఏప్రిల్ 2న ఫలితాలు వెలువడాల్సి ఉండగా.. ఎన్నికల సంఘం నిర్ణయంతో జూన్ రెండుకు వాయిదా పడింది.

రెండుగంటల్లో ఫలితం..

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల శాసనమండలి ఎన్నికల ఫలితం రెండు గంటల్లోనే వెలువడనున్నది. మొత్తం ఐదు టేబుళ్లను వినియోగించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 10 పోలింగ్ కేంద్రాల బ్యాలెట్ బాక్స్‌లవారీగా టేబుళ్లకు తరలిస్తారు. పోలైన ఓట్లకు, బ్యాలెట్ బాక్సుల్లో ఉన్న పత్రాలకు లెక్క సరిచూసి ఓట్ల లెక్కింపును చేపడతారు. ఎమ్మెల్సీ ఎన్నిక ప్రాధాన్యత ప్రకారం ఓట్లు లెక్కించే ప్రక్రియను చేపడుతారు. మొదటి ప్రాధాన్యతా ఓటులో ఓటింగ్ సరళికి సరిపడా పర్సంటేజ్ ఓట్లను ఏ అభ్యర్థి అయితే పొందుతారో అతడిని గెలిచినట్లు ప్రకటిస్తారు. కాగా ఒక్కోసారి మొదటి ప్రాధాన్యతా ఓట్లతో ఫలితం తేలకపోతే రెండో ప్రాధాన్యతా ఓట్లను లెక్కిస్తారు. ఇందులో ఎవరికి ఎక్కువ వస్తే వారిని విజేతగా ప్రకటిస్తారు. లెక్కింపులో జాగ్రత్తగా వ్యవహరించాలని ఎన్నికల సిబ్బందిని రిటర్నింగ్ అధికారి ఆదేశించారు.

66 రోజుల తర్వాత..

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు 66 రోజుల తర్వాత జరుగనున్నది. మార్చి 28న పోలింగ్ జరుగగా.. ఏప్రిల్ 2న ఫలితాన్ని లెక్కించాల్సి ఉన్నది. కానీ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఫలితాన్ని వాయిదా వేసి రెండు నెలల తర్వాత లెక్కింపు చేయనుండడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొన్నది. కాగా ఎన్నికల్లో గెలుపోటములపై బెట్టింగ్ జోరుగా సాగుతున్నది.

అధికారుల ఏర్పాట్ల పరిశీలన

ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరుగనున్న మహబూబ్‌నగర్ స్థానికసంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉపఎన్నిక కౌంటింగ్ ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి జి.రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్‌తో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు ఉన్నారు.

ఇగోతోనే రేవంత్ మార్పులు

చరిత్రనే చెరిపేస్తారా..?

- తెలంగాణ గేయాన్ని మార్చడం తప్పిదమే..
- రాష్ట్రంలో సంగీత దర్శకులు కరువయ్యారా..?
- రేవంత్ అనాలోచిత నిర్ణయంపై ఆగ్రహం
- కాకతీయ తోరణం, చార్మినార్ గుర్తులను తొలగిస్తే సహించేది లేదంటున్న కవులు

తెలంగాణ గేయాన్ని మార్చడం చారిత్రక తప్పిదమే అంటూ రేవంత్ సర్కారుపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. రాష్ట్రంలో సంగీత దర్శకులే కరువయ్యారా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. రేవంత్ అనాలోచిత నిర్ణయంపై ఆగ్రహావేశాలు భగ్గుమంటున్నాయి. దీనికి తోడు రాష్ట్ర అధికార ముద్ర నుంచి వారసత్వ చిహ్నం కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించేందుకు కుట్ర జరగడం సరికాదన్నారు. ఒకవేళ అదే జరిగితే ఉద్యమం తప్పదని పలువురు కవులు, రచయితలు, కళాకారులు, ప్రజలు హెచ్చరిస్తున్నారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మే 31

ప్రభుత్వానిది అవివేక చర్య

ఇగోతో లోగోను మార్చడం సరి కాదు. అధికార చిహ్నాన్ని చూడగానే రాష్ట్ర గొప్పతనం తెలిసేలా ఉండాలి. ప్రస్తుతం ఉన్న చిహ్నం అలాగే ఉంది. రాజసం, కళలు, కట్టడాలు, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, త్యాగనిరతి అన్ని కలబోసిన చిహ్నం కాకతీయ కళాతోరణం, చార్మినార్. చిహ్నం రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను నలుదిశలా ఇనుమడింప చేసేదిగా ఉండాలి. అప్పుడే చిహ్నానికి, రాష్ట్రానికి గౌరవం. ఎందరో మేధావులు, కవులు, కళాకారుల కృషితో ఏర్పాటైన చిహ్నాన్ని మార్చాలన్న ప్రభుత్వ నిర్ణయం.. కవులందరినీ అవమానించడమే.. భావితరాలకు తెలంగాణ చరిత్రను తెలిపే ప్రయత్నం చేయాలి తప్పా.. చెరిపే ప్రయత్నం చేయొద్దు. కాకతీయుల కళాతోరణం, చార్మినార్ రాచరికపు ఆనవాళ్లని.. వాటి రూపురేఖలు లేకుండా చేయాలనుకోవడం ప్రభుత్వ అవివేక చర్య. ప్రస్తుతం ఉన్న చిహ్నాన్ని కొనసాగిస్తూ అదనంగా వ్యవసాయం, కృష్ణ, గోదావరి నదులను జ్ఞప్తి చేసుకొని రూపొందించాలి.

- గోసాయి వేణు, వచన కవి, గద్వాల

ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించాలి

- మొదట పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్
- నాగర్‌కర్నూల్, అచ్చంపేట, గద్వాల, వనపర్తి నియోజకవర్గాలకు 16 టేబుళ్లు
- కల్వకుర్తి, కొల్లాపూర్, అలంపూర్‌కు 14 ఏర్పాటు..
- సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి
- తిరస్కరణకు గురైన ఓటు వివరాలను ఏజెంట్లకు స్పష్టంగా వివరించాలి
- కౌంటింగ్ సిబ్బందికి రెండో విడుత శిక్షణలో కలెక్టర్ ఉదయ్‌కుమార్

శిక్షణలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్, పాల్గొన్న అధికారులు, సిబ్బంది

నాగర్‌కర్నూల్, మే 31: నిబంధనలను పక్కాగా పాటిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్ సూచించారు. నెల్లికొండ మార్కెట్‌యార్డులో జూన్ 4వ తేదీన చేపట్టనున్న నాగర్‌కర్నూల్ ఎంపీ ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లకు రెండో విడుత శిక్షణ తరగతులు నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈవీఎం ఓట్ల లెక్కింపు ఎలా చేయాలి? పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఎలా? అనే అంశాలపై సంబంధిత అధికారులు, సిబ్బందికి వేర్వేరుగా శిక్షణ ఇచ్చారు. పలువురు కౌంటింగ్ సిబ్బంది సందేహాలను మాస్టర్ ట్రైనర్లు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 6 గంటలకు సిబ్బంది ఓట్ల లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని, నియోజకవర్గాల వారీగా టేబుళ్లను కేటాయిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం నాగర్‌కర్నూల్, అచ్చంపేట, గద్వాల, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 16 టేబుళ్ల, కల్వకుర్తి, కొల్లాపూర్, అలంపూర్ నియోజకవర్గాలకు సంబంధించి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ప్రత్యేకంగా 14 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపును ప్రారంభించేందుకు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈవీఎం ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ, ప్రతి రౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరిచేస్తారని, కౌంటింగ్ ప్రక్రియను యథావిధిగా కొనసాగించాలన్నారు. కౌంటింగ్ సిబ్బందితోపాటు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణ కోసం నియమించబడిన ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, గందరగోళానికి తావిచ్చేలా వ్యవహరించొద్దని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు అనుమతించబడవని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకులు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. మైక్రో అబ్జర్వర్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో శిక్షణ నోడల్ అధికారి గోపాల్‌నాయక్, ఎల్‌డీఎం కౌశల్ కిశోర్‌పాండే పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల కలకలం

- 18 క్వింటాళ్ల పత్తి విత్తనాలు పట్టివేత
- ఏపీ నుంచి తెలంగాణకు తరలిస్తుండగా పుల్లూర్ టోల్‌గేట్ వద్ద స్వాధీనం చేసుకున్న పోలీసులు

విచారణ చేస్తున్న సీఐ రవిబాబు

ఉండవెల్లి, మే 31 : ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్న ఘటన పుల్లూర్ టోల్‌గేట్ వద్ద చోటుచేసుకున్నది. ఏఎస్సై సుబ్బారెడ్డి కథనం మేరకు.. ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లాకు చెందిన డ్రైవర్ కోటీశ్వరారావు ఏపీ 39యూఫ్ 8370 నెంబరు గల బొలేరో వాహనంలో నంద్యాల నుంచి 18క్వింటాళ్ల పత్తి(లూజ్) విత్తనాల లోడ్‌తో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు బయలుదేరాడు. ముందస్తు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ, పోలీసు అధికారులు గురువారం రాత్రి 11 గంటలకు పుల్లూర్ టోల్‌గేట్ వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈక్రమంలో 36 సంచుల్లో నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్నట్లు గుర్తించి వాటి విలువ రూ.9లక్షలు ఉంటుందని నిర్ధారించారు. సీఐ రవిబాబు ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు పంచనామా నిర్వహించి కోటీశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. నకిలీ సూత్రదారులు, విక్రయదారులెవరనే కోణంలో విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పశువుల కొవ్వుతో

నూనె తయారీ

- గుట్టు చప్పుడుకాకుండా దందా
- తెలంగాణతోపాటు ఏపీ, కర్ణాటకకూ తరలింపు
- కాలనీవాసుల రంగప్రవేశంతో ముఠా గుట్టు రట్టు
- కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు

కొవ్వుతో నూనె తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన పాత్రలు, సామగ్రి

అయిజ, మే 31 : పశువుల కొవ్వుతో గుట్టుచప్పుడు కాకుండా నూనె తయారుచేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఊరికి దూరంగా ఓ గుడిసెలో పశువుల కొవ్వుతో నూనె తయారు చేసి స్థానికంగా విక్రయించడంతోపాటు తెలంగాణ, ఏపీ, కర్ణాటక ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయిజ పట్టణంలోని ఎస్సీకాలనీకి సమీపంలో కొందరు రేకులతో కూడిన గుడిసెను ఏర్పాటు చేసుకొని నూనెను తయారు చేస్తున్నారు. ప్రతి ఆదివారం పట్టణంలోకి వస్తున్న ఎద్దుల కొవ్వును గుడిసెకు తరలించి అక్కడే మంటపై కరిగించి నూనె తయారు చేస్తున్నట్లు కాలనీవాసులు గుర్తించారు. స్థానికంగా విక్రయించడంతోపాటు నాగల్‌దిన్నె వంతెన మీదుగా ఏపీ, కర్ణాటక ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గుడిసెలో నుంచి దుర్వాసన వస్తుండడంతో గ్రహించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు గుడిసెను పరిశీలించి నూనె తయారీకి ఉపయోగిస్తున్న పదార్థాలను స్వాధీనం చేసుకొని ల్యాబ్‌కు పంపించారు. ఇంతకాలం కొవ్వుతో తయారు చేసిన నూనెను ఎక్కడెక్కడ విక్రయించారనే వివరాలను సేకరిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తయారీదారులను పోలీసులు వెంటనే పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.